సంపుటి :02 సంచిక :282 పేజీలు :07 వెల ₹5

# అక్షర దర్బార్


www.aksharadarbar.com Voice of the people

సోమవారం 19, జనవరి 2026

## తెలంగాణ స్పీకర్‌కు చుక్కెదురు

- స్పీకర్ తీరుపై సుప్రీం కోర్టు అసహనం
- బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి పిటిషన్ పై విచారణ
- ఎమ్మెల్యేల ఫిరాయింపుల అంశం తేల్చకపోవడంపై స్పీకర్ కు నోటీసులు

06



## అంతర్మథనంలో నేతలు

- ఎవరికి దక్కేది టికెట్?
- పరకాలలో ముసుగు తెర రాజకీయాలు

03






02

# మున్సిపోల్ కు కాంగ్రెస్ బిగ్ ప్లాన్

### పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా మంత్రులకు బాధ్యతలు

- వరంగల్ కు పొంగులేటి
- మానుకోటకు పొన్నం ప్రభాకర్

తెలంగాణలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ సమర శంఖం పూరించింది. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ నాయకత్వం వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాలకు సీనియర్ మంత్రులు మరియు కీలక నేతలను ఇన్‌చార్జిలుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

– అక్షరదర్బార్, హైదరాబాద్




## పట్టణాల్లో మున్సిపల్ ఎన్నికల కోలాహలం


# ఏ వార్డు గెలుపు వరమిచ్చునో?

02

- ఆచితూచి పావులు కదుపుతున్న చైర్మన్ పదవి ఆశావహులు
- కోటా పరంగా కలిసిరాకపోతే పక్క వార్డులపై నజర్
- జనరల్ లేదా తమ సామాజిక వర్గానికి రిజర్వ్ అయిన వార్డు వైపు చూపు
- అప్పటికే ఆయా స్థానాల్లోని ఆశావహులకు బుజ్జగింపులు
- ఎలాగైనా ఎన్నికల్లో గెలవాలని వ్యూహ ప్రతివ్యూహాలు

తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగనుండటంతో ఉమ్మ డి వరంగల్ జిల్లాలో ఎన్నికల వేడి మొదలైంది. 12 మున్సిపాలిటీల్లో చైర్మన్ పీఠాలు ఆశించే ఆశావహులు వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగిపోయారు. తమ సొంత వార్డుల్లో రిజర్వేషన్లు కలిసిరాకపోవడంతో పక్క వార్డుల వైపు చూస్తున్నారు. తమ సామాజికవర్గానికి అనుకూలంగా ఉన్న వార్డును లేదంటే జనరల్ స్థానాన్ని దక్కించుకునేందుకు సర్వశక్తులొడ్డుతున్నారు. ఎన్నికల కురుక్షేత్రంలో తమ పట్టు నిరూపించుకుని, చైర్మన్ గిరి చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు.

– అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి



# నా జన్మ ధన్యం




- మేడారం అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం సంతోషాన్నిచ్చింది
- పునరుద్ధరణ పనులను భక్తులకు అంకితం చేస్తున్నాం..
- మహా జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మనవడితో కలిసి సీఎం తులాభారం
- వన దేవతలకు 68 కిలోల బంగారం (బెల్లం) సమర్పణ

05

# ఏ వార్డు గెలుపు వరమిచ్చునో?

- పట్టణాల్లో మున్సిపల్ ఎన్నికల కోలాహలం
- ఆచితూచి పావులు కదుపుతున్న చైర్మన్ పదవి ఆశావహులు
- కోటా పరంగా కలిసిరాకపోతే పక్క వార్డులపై నజర్
- జనరల్ లేదా తమ సామాజికవర్గానికి రిజర్వ్ అయిన వార్డు వైపు చూపు
- అప్పటికే ఆయా స్థానాల్లోని ఆశావహులకు బుజ్జగింపులు
- ఎలాగైనా ఎన్నికల్లో గెలవాలని వ్యూహ ప్రతివ్యూహాలు



**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి**

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా కీలక ఘట్టం పూర్తయింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం మేడారంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు మున్సిపల్ ఎన్నికల తీర్మానానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఫిబ్రవరిలో శివరాత్రి, రంజాన్ వేళ ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఎన్నికలు నిర్వహించాలని యంత్రాంగానికి ఆదేశాలిచ్చింది. దీనిలో భాగంగానే ఎన్నికలపై రాష్ట్రప్రభుత్వం వద్ద ఉన్న వార్డులు, ఓటర్ల జాబితా నివేదికలను సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘానికి అందజేసింది. ఎన్నికల ప్రక్రియ కీలక దశకు చేరుకున్న నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పరకాల, నర్సంపేట, వర్ధన్నపేట, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, భూపాలపల్లి, మహబూబాబాద్, డోర్నకల్, కేసముద్రం, మరిపెడ, తొర్రూరు, ములుగు మున్సిపాలిటీల్లో ఎన్నికల కోలాహలం మొదలైంది.

**- ఆశావహుల ప్రదక్షిణ**

మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్ల ఖరారు కావడం, మంత్రివర్గం కూడా ఎన్నికల నిర్వహణకు సై అనడంతో ఆశావహుల్లో సరికొత్త ఉత్సాహం నెలకొంది. పార్టీ గుర్తులపై జరిగే ఎన్నికలు కావడంతో ఆశావహులు ఇప్పటికే ఆ నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఆయా పార్టీల నియోజకవర్గ ఇన్‌చార్జుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమకంటే తమకే సీటు కేటాయించాలని పట్టుబడుతున్నారు. ఇక చైర్మన్ పదవి ఆశిస్తున్న అభ్యర్థులైతే ఎంత ఖర్చైనా ఫర్వాలేదు.. మున్సిపాలిటీ పరిధిలో తమ పార్టీ నుంచి పోటీ చేస్తున్న అందరు అభ్యర్థులకు సైతం తామే ఖర్చు పెడతామని హామీ ఇస్తున్నారు. ఈసారి మహిళలకు 50% కోటా ఉండటంతో ఆశావహులు తమ భార్యలను లేదా కుటుంబ సభ్యులను బరిలోకి దింపేందుకు సిద్ధమవుతున్నారు.

**- అనుకూలమైన వార్డులపై నజర్**

మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ పదవి ఆశిస్తున్న ఆశావహులకు క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చైర్మన్ కావాలనుకున్న వారు ఎట్టిపరిస్థితుల్లోనూ ఏదేని ఓ వార్డు నుంచి పోటీ చేయాల్సిందే. ఎన్నికల్లో గెలవాల్సిందే. ఇదే వారికి పెద్ద సవాల్. తాము నివాసం ఉంటున్న వార్డు రిజర్వేషన్ ఇతర సామాజికవర్గానికి కేటాయింపు జరిగితే చైర్మన్ పదవి ఆశిస్తున్న ఆశావహుల నజర్ ఆ మున్సిపాలిటీలో తమ సామాజికవర్గానికి కేటాయించిన వార్డు వైపు మళ్లుతోంది. అలాగే జనరల్ స్థానాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పక్క వార్డులో పోటీ చేద్దామంటే అప్పటికే.. ఆ వార్డులో అప్పటికే వారి తరఫున పోటీదారులు ఉంటారు. వారిని సముదాయించి, నయానో భయానో ఆ వార్డు సీటు దక్కించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.
మున్సిపల్ చైర్మన్ పదవి దక్కించుకోవాలనుకునే వారు కేవలం ఒక వార్డుకే పరిమితం కాకుండా మున్సిపాలిటీ మొత్తం మీద పట్టు కోసం ప్రయత్నిస్తున్నారు. వారి ఏర్పాట్లు ఇలా ఉన్నాయి. చైర్మన్ పదవిని దక్కించుకోవాలంటే మెజారిటీ కౌన్సిలర్ల మద్దతు అవసరం. అందుకే తమకు అనుకూలమైన వ్యక్తులకు వివిధ వార్డుల్లో టికెట్లు ఇప్పించుకునేలా పార్టీ పెద్దలపై ఒత్తిడి తెస్తున్నారు. పార్టీ పెద్దల ప్రసన్నం కోసం జిల్లా మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తాము గెలిస్తే పార్టీకి ఎలా ఉపయోగపడతామో వివరిస్తూ "అండ" దండల కోసం పాకులాడుతున్నారు. మున్సిపల్ ఎన్నికలు ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో, ఎన్నికల వ్యయం కోసం ముందే నిధులు సమకూర్చుకుంటున్నారు. వార్డుల్లో బలమైన అభ్యర్థులకు ఆర్థికంగా అండగా ఉంటామని భరోసా ఇస్తున్నారు.

**- క్షేత్రస్థాయిలో సందడి**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు పట్టణ పరిధిలో ఏ శుభకార్యం జరిగినా హాజరవుతున్నారు. దశదిన కర్మలు, స్థానిక ఆలయ ఉత్సవాలు ఇలా.. ఎక్కడ చూసినా ఆశావహులే కనిపిస్తున్నారు. వాట్సాప్ గ్రూపులు, ఫేస్‌బుక్ పేజీల ద్వారా తమను తాము ప్రచారం చేసుకుంటున్నారు.

**- ప్రధాన పార్టీల వ్యూహం**

అధికార కాంగ్రెస్ పార్టీ మొత్తం ఎన్నికలు జరుగనున్న మొత్తం 117 మున్సిపాలిటీల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవాలని ఉవ్విళ్లూరుతున్నది. దీనిలో భాగంగానే అధిష్ఠానం ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ పార్లమెంటరీ సెగ్మెంట్లకు ఇన్‌చార్జులను నియమించింది. వరంగల్ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మంత్రి పొన్నం ప్రభాకర్ నియమితులయ్యారు. మరోవైపు బీఆర్ఎస్ కూడా ఎన్నికల్లో తన పట్టునిలుపుకొనేందుకు పావులు కదుపుతున్నది. మరోవైపు మరో ప్రధాన పార్టీ అయిన బీజేపీ సెమీ అర్బన్ మున్సిపాలిటీల్లో తమకు పెద్ద పట్టు లేకపోవడంతో, పట్టణాలపై దృష్టి సారిస్తున్నది.

## మున్సిపోల్ కు కాంగ్రెస్ 'బిగ్ ప్లాన్'

- పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా మంత్రులకు బాధ్యతలు
- వరంగల్ కు పొంగులేటి
- మానుకోటకు పొన్నం ప్రభాకర్

అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ సమరశంఖం పూరించింది. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ నాయకత్వం వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాలకు సీనియర్ మంత్రులు మరియు కీలక నేతలను ఇన్‌చార్జిలుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

**- కాంగ్రెస్ 'మిషన్ 17'**

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగనున్న తరుణంలో అధికార కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. పట్టణ స్థానిక సంస్థల్లో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా, ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక మంత్రిని ఇన్‌చార్జిగా నియమించింది. అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచార పర్వం వరకు అన్నింటినీ ఈ మంత్రులే పర్యవేక్షించనున్నారు.

**- నియమితులైన మంత్రులు**

**నిజామాబాద్: ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి**
**మల్కాజిగిరి : కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**
**భువనగిరి: డి. అనసూయ - సీతక్క**
**మహబూబ్ నగర్: దామోదర రాజనర్సింహ**
**చేవెళ్ల: దుద్దిళ్ల శ్రీధర్ బాబు**
**కరీంనగర్ : తుమ్మల నాగేశ్వరరావు**
**ఖమ్మం : కొండా సురేఖ**
**వరంగల్ : పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**
**మహబూబాబాద్ : పొన్నం ప్రభాకర్**
**మెదక్ : గడ్డం వివేక్ వెంకటస్వామి**
**పెద్దపల్లి : జూపల్లి కృష్ణారావు**
**నల్గొండ: అడ్లూరి లక్ష్మణ్ కుమార్**
**నాగర్ కర్నూల్ : వాకిటి శ్రీహరి**
**జహీరాబాద్ : మహ్మద్ అజారుద్దీన్**
**ఆదిలాబాద్ : సుదర్శన్ రెడ్డి (ప్రభుత్వ సలహాదారు)**

**- వ్యూహాత్మక బాధ్యతలు:**

స్థానిక ఎమ్మెల్యేలు, నాయకులతో సమన్వయం చేసుకుంటూ, గెలుపు గుర్రాలను ఖరారు చేసే బాధ్యత ఈ మంత్రులదే. పార్టీలో ఉన్న అసంతృప్త నేతలను బుజ్జగించడం, రెబల్స్ సమస్య తలెత్తకుండా చూడటం వీరి ప్రధాన కర్తవ్యం. గత ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని అధిష్టానం ఆదేశించింది. సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనకు వెళ్లే ముందే ఈ జాబితాను ఖరారు చేయడం విశేషం. ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున, వెంటనే క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని మంత్రులకు సూచించారు.

# 3.75 కోట్లతో బస్ స్టేషన్

- ఎమ్మెల్యే జీఎస్సార్ తో కలిసి రేగొండలో శంకుస్థాపన చేసిన మంత్రి పొన్నం

అక్షరదర్బార్, రేగొండ: రేగొండ మండల కేంద్రంలోని జగ్గయ్యపేట రోడ్డులో రూ.3.75 కోట్లతో నూతన బస్ స్టేషన్ నిర్మాణ పనులకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్, ఆర్టీసీ ఈడీతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 97 డిపోలు ఉంటే 341 బస్ స్టేషన్లలో పదివేల బస్సులు, దాదాపు 40 వేల మంది ఉద్యోగులుగా పనిచేస్తున్నారని తెలిపారు. ఆర్టీసీ ద్వారా రోజుకు 65 లక్షల మంది ప్రజలను చేరవేస్తూ 35 లక్షల కిలోమీటర్లు బస్సులు ఆర్టీసీ నడిపిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా రైల్వే లైఫ్ లైన్ లో ఎలా ఉందో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల పేద ప్రజలతో సహా అందరు కూడా ఒక లైఫ్ లైన్ గా ఆర్టీసీ నడుస్తుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం ప్రకారం ఆర్టీసీ బస్సు ప్రతి గ్రామానికి చేరాల్సిందే.. ప్రజలు దాన్ని గౌరవించి ఆర్టీసీ బస్సు ఎక్కితే సురక్షితంగా చేరుకుంటారన్నారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో అమలు చేసి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. ప్రజలందరికీ సౌకర్యంగా ఉండే విధంగా ఇంజనీరింగ్ ప్లాన్ చేసుకొని, గ్రామపంచాయతీ పర్మిషన్ తో రేగొండ బస్టాండ్ ను సుందరంగా నిర్మించాలన్నారు.






# అంతర్మథనంలో నేతలు

- ఎవరికి దక్కేది టికెట్?
- పరకాలలో ముసుగు తెర రాజకీయాలు

అక్షరదర్బార్,పరకాల:పరకాల మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి నేటివరకు రాజకీయ పార్టీల తీరు భిన్నంగా ఉంటుందన్న ప్రచారం కొనసాగుతూనే ఉంది. గతంలో రిజర్వేషన్లు అనుకూలంగా రావడంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చైర్మన్ పదవిని కైవసం చేసుకోగా, ఈసారి రిజర్వేషన్లు ఆశావాహులకు అనుకూలంగా లేకపోవడంతో ఏ వార్డు నుంచి పోటీ చేయాలన్న అంశంపై నేతలు, ఆశావాహులు అంతర్మథనంలో ఉన్నట్లు సమాచారం.

**- టికెట్ కోసం ఆశావాహుల ప్రదక్షిణలు**

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల కోలాహలం మొదలవడంతో పరకాల పట్టణంలో ఆశావాహులు తమ తమ పార్టీ నేతల చుట్టూ తిరుగుతూ ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఎవరికి టికెట్ ఇవ్వాలన్న విషయంలో పార్టీ నేతలు తేల్చుకోలేకపోతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఆదివారం తెలంగాణ ముఖ్యమంత్రి మేడారం జాతర సందర్భంగా నిర్వహించిన కేబినెట్ సమావేశంలో ఫిబ్రవరిలోనే మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని తేల్చడంతో ఆశావాహుల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. ఎవరికి టికెట్ వస్తుందోనన్న ఎదురుచూపులో వారు ఉన్నారు.

**- 22 వార్డుల్లో జాబితాలు సిద్ధం**

పరకాల మున్సిపాలిటీలో మొత్తం 22 వార్డులు ఉండగా, కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే నాలుగు వార్డుల నుంచి ఆశావాహుల పేర్లను సేకరించినట్లు ప్రచారం జరుగుతోంది. అదే విధంగా ఆదివారం బీజేపీ కార్యాలయంలో ఒక్కో వార్డు నుంచి నలుగురు ఆశావాహుల పేర్లను తీసుకున్నట్లు వినికిడి. బీఆర్ఎస్ కూడా ఆశావాహుల పేర్లను సేకరించినట్లు తెలుస్తోంది.

**- పోటీదారుల పేర్లు వెల్లడించకుండా సన్నాహక సమావేశాలు**

కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచి ఆత్మకూరు, దామర, సంగెం, నడికూడ మండలాల ఇన్‌చార్జీలను నియమించి 22 వార్డులలో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే ఈ సమావేశాల్లో ఎవరు పోటీ చేస్తారన్న విషయాన్ని వెల్లడించకపోవడంతో, పార్టీలోని కార్యకర్తలు, ఆశావాహులు నిరాశలో పాల్గొంటున్నట్లు సమాచారం.

**- చైర్మన్ అభ్యర్థిపై స్పష్టత లేని పార్టీలు**

కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి చైర్మన్ అభ్యర్థి ఎవరన్నది ఇప్పటివరకు ఖరారు కాకపోవడంతో రకరకాల ప్రచారాలు ఊపందుకున్నాయి. కౌన్సిలర్‌గా పోటీ చేయాలని భావిస్తున్న పలువురు నేతలు సైతం అవకాశం వస్తే చైర్మన్ పదవిని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేయడం ఊహించని వ్యక్తి చైర్మన్ అవుతారని పరకాల రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



# జాతర పనులు ప్రారంభం

- జాతర నిర్వహణ కోసం నిధులు మంజూరు
- భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు

అక్షర దర్బార్, మొగుళ్ళపల్లి: ములకలపల్లి – మొగుళ్లపల్లి గ్రామాల మధ్యగల సమ్మక్క సారలమ్మ జాతర పనులు శరవేగంగా జరుగుతున్నాయి.



ఈనెల 28 నుండి 31 తేదీ వరకు జరిగే జాతర కోసం నిర్వాహకులు పనులను వేగవంతం చేశారు. సమ్మక్క సారలమ్మ జాతర చుట్టు పేరుకుపోయిన చెత్తాచెదారం ను ట్రాక్టర్లతో చదును చేయించి శుభ్రపరిచారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా బాత్రూమ్స్. తాగునీరు. విద్యుత్తు. సెక్యూరిటీ. తదితర అంశాలపై నిర్వాహకులు దృష్టి పెట్టారు. జాతర సమయంలో చిరు వ్యాపారస్తులకు వ్యాపార నిర్వహణ అనుమతి కోసం దారాదత్తుగా రూ.54 వేలు వసూలు అయినట్లు జాతర నిర్వహణ కమిటీ ప్రధాన కార్యదర్శి చదువు అన్నారెడ్డి తెలిపారు.

## జాతర నిర్వహణకు నిధులు మంజూరు

**- మొగుళ్లపల్లి సర్పంచ్ చాట్ల విజయ రవీందర్**

ఆర్డబ్ల్యూఎస్ నిధుల నుండి జాతరలో మంచినీటి, శానిటేషన్, విద్యుత్తు, సెక్యూరిటీ తదితర అభివృద్ధి పనుల కోసం ఆరు లక్షల రూపాయలు ఎమ్మెల్యే మంజూరు చేయించినట్లు మొగుళ్ళపల్లి సర్పంచి చాట్ల విజయ రవీందర్ తెలిపారు.

## జాతరలో సీసీ కెమెరాల ఏర్పాటు : ఎస్సై బి. అశోక్

సమ్మక్క సారలమ్మ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా 10 సీసీ కెమెరాలతో పాటు ట్రాఫిక్ ను నియంత్రించేందుకు పది బారికేడ్స్ లను ఏర్పాటు చేస్తున్నట్లు మొగుళ్ళపల్లి ఎస్సై బొరగాల అశోక్ తెలిపారు.

జాతర వాల్ పోస్టర్ ఆవిష్కరణ ములకలపల్లి– మొగుళ్లపల్లి గ్రామాల మధ్య వెలసిన వనదేవతలు సమ్మక్క సారలమ్మ జాతర వాల్ పోస్టర్ ను జాతర కమిటీ నిర్వాహకులు ఆదివారం ఆవిష్కరించారు. రెండు గ్రామాల సర్పంచులతో  జాతర నిర్వహణ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గంగాధర్ రావు, చదువు అన్నారెడ్డి, కమిటీ మెంబర్లు పాల్గొని వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు



# నా ప్లాస్టిక్ నా బ్యాగ్ లోనే

- మేడారం జాతరలో ప్లాస్టిక్ వ్యర్థాల నివారణకు విద్యార్థుల వినూత్న కార్యక్రమం

అక్షర దర్బార్, పరకాల : సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా అడవిని కాపాడాలనే ఉద్దేశంతో హనుమకొండ జిల్లా నడికూడ మండలం ముస్త్యాలపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వినూత్న అవగాహన కార్యక్రమం నిర్వహించారు. “నా ప్లాస్టిక్ నా బ్యాగ్‌లోనే”, “మా చెత్త మా ఇంటికే” అనే నినాదాలతో క్యారీ బ్యాగ్‌లను ప్రదర్శిస్తూ భక్తులను ఆకట్టుకున్నారు. జాతరకు వెళ్లే ప్రతి ఒక్కరూ ఒక క్యారీ బ్యాగ్ తీసుకెళ్లి చెత్తను అందులోనే సేకరించాలని విద్యార్థులు పిలుపునిచ్చారు. భక్తి అంటే దర్శనంతో పాటు ప్రకృతిని కాపాడటమేనని ఈ కార్యక్రమం బలమైన సందేశం ఇచ్చిందని గ్రామస్థులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు కందుకూరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పావని, సత్యపాల్ అభినందించారు.

# నూతన సర్పంచ్ లకు శిక్షణ..

**హాజరైన నడికూడ సర్పంచులు**



అక్షర దర్బార్, పరకాల: టి.జీ.ఐ.ఆర్.డి వారి సౌజన్యంతో హాసన్‌పర్తి విస్తరణ శిక్షణ వేదికలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ & గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సర్పంచ్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో నడికూడ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్లు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి, పంచాయతీ పాలనలో సర్పంచ్ల పాత్ర, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సేవల నిర్వహణపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీపీ రామకృష్ణ, ఎంపీఓ మార్గవి రెడ్డి పాల్గొని మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్ల బాధ్యత ఎంతో కీలకమని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. శిక్షణ ద్వారా సర్పంచ్లు గ్రామ పాలనలో మరింత సమర్థులుగా మారతారని నిర్వాహకులు తెలిపారు.

## నిత్యశ్రీ –చైత్ర మృతుల విచారణ రిపోర్ట్ విడుదల చేయాలి : బీఎస్పీ

అక్షరదర్బార్, మరిపెడ :  మరిపెడ మండలం గిరిపురం గ్రామం ఇటుకల గడ్డ తండాలో అంగన్‌వాడీ కేంద్రంలో ఫుడ్ పాయిజనింగ్‌కు గురై మృతి చెందిన నిత్యశ్రీ, చైత్రల కేసులో విచారణ కమిటీ రిపోర్ట్‌ను వెంటనే విడుదల చేయాలని బీఎస్పీ రాష్ట్ర నాయకుడు దార్ల శివరాజ్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కోర్టు ఎదుట డా.అంబేద్కర్ విగ్రహం వద్ద బాధిత కుటుంబాలతో కలిసి నిరసనకు దిగారు. నెల రోజులు గడిచినా నివేదిక బయటకు రాకపోవడం అన్యాయమని అన్నారు. బాధ్యులైన అంగన్‌వాడీ టీచర్, ఆయా, అధికారులపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని కోరారు. విచారణ రిపోర్ట్ విడుదల చేయకపోతే బీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# నర్సంపేటలో కాషాయ జెండా ఎగరేయాలి

**బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి**




అక్షర దర్బార్, నర్సంపేట : రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో నర్సంపేట గడ్డపై కాషాయ జెండా ఎగరేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు. సోమవారం నర్సంపేట నియోజకవర్గ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్ అధ్యక్షతన మున్సిపాలిటీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సంపేట మున్సిపాలిటీలోని 30 వార్డుల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేలా కార్యకర్తలు కష్టపడాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అవినీతి పాలన, కాంగ్రెస్ దౌర్జన్య పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను గడప గడపకు చేరవేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వడ్డేపల్లి నరసింహారాములు, జిల్లా ఉపాధ్యక్షులు రేసు శ్రీనివాస్ , సీనియర్ నాయకులు కూనమళ్ళ పృథ్వీ రాజ్ , జూలూరి మనీష్ గౌడ్ , శీలం సత్యనారాయణ, బాల్నే జగన్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పొదిళ్ల రామచందర్, నర్సంపేట పట్టణ ప్రధాన కార్యదర్శి సూత్రపు పాల్గొన్నారు


క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ విజయలక్ష్మి


క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు


క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న ప్రముఖ వ్యాపారి తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు

## సమస్యలపై పోరాటమే అక్షర దర్బార్ నైజం

### క్యాలెండర్ ఆవిష్కరణలో తహసీల్దార్ విజయలక్ష్మి

అక్షర దర్బార్, పరకాల : ప్రజా సమస్యలపై పోరాటం చేయడమే అక్షర దర్బార్ నైజమని పరకాల తహసీల్దార్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం పరకాల తహసీల్దార్ కార్యాలయంలో అక్షర దర్బార్ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలిచి విశ్లేషణాత్మక వార్తలు ప్రచురిస్తున్న అక్షర దర్బార్ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమం లో ప్రముఖ వ్యాపారి తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్, ప్రధాన కార్యదర్శులు సంఘు పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, జిల్లా నాయకులు కుక్కల విజయ్ కుమార్, ఆకుల శ్రీధర్ క్యాలెండర్ ను ఆవిష్కరించారు.

# మహిళల అభ్యున్నతికి ప్రభుత్వ ప్రాధాన్యం

- పాల శీతలీకరణ కేంద్రానికి శంకుస్థాపన
- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి






అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం పరకాల మున్సిపాలిటీ పరిధిలోని మహిళలకు ఇందిరమ్మ చీరలు మరియు వడ్డీ లేని రుణాలను శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి, సామాజిక అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంద న్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు సంక్షేమ కార్య క్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. పట్టణం లోని 103 మహిళా సంఘాలకు రూ.33,93,925 వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామని పేర్కొన్నారు. కుటుంబ అభివృద్ధిలో మహిళలే కీలకమని, మహిళ లపై పూర్తి నమ్మకంతో పరకాల మహిళా డైరీ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి మహిళకు పారదర్శకంగా,ప్రణాళికాబద్ధంగా ఇందిరమ్మ చీరలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

### నడికూడలో కేంద్రానికి శంకుస్థాపన

నడికూడ మండల కేంద్రంలో నిర్మిస్తున్న పాల శీతలీ కరణ కేంద్రం (బి ఎం సి) భవనానికి సోమవారం పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి, హను మకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల కోసం ఏర్పాటు చేసిన పరకాల ఇందిరా మహిళా డైరీని ప్రభుత్వ సహకారంతో, రాజకీయా లకు అతీతంగా అభివృద్ధి చేసుకుందామని పిలుపుని చ్చారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ఎన్. రవి, డీఆర్డీఏ ఏపీడీ మేన శ్రీను, పరకాల ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ, పరకాల, నడికూడా తహసీల్దార్లు విజ యలక్ష్మి , రాణి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# నా జన్మ ధన్యం

- మేడారం అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం సంతోషాన్నిచ్చింది
- పునరుద్ధరణ పనులను భక్తులకు అంకితం చేస్తున్నాం..
- మహా జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మనవడితో కలిసి సీఎం తులాభారం
- వన దేవతలకు 68 కిలోల బంగారం (బెల్లం) సమర్పణ



అక్షరదర్బార్, మేడారం:
మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణాన్ని, రూ. 251 కోట్లతో చేపట్టిన ఇతర అభివృద్ధి పనులను ప్రారంభించడంతో తన జన్మ ధన్యమైందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దక్షిణాది కుంభమేళాగా భావించే మేడారం అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్ రూపొందించి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. మేడారం సమగ్ర అభివృద్ధి కోసం 251 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన పనుల పైలాన్‌ను సోమవారం ఉదయం ఆయన ఆవిష్కరించారు. పున రుద్ధరించిన వనదేవతల ఆలయాన్ని ప్రారంభించి ప్రజా ప్రభుత్వంలో భక్తులకు అంకితం చేసే పవిత్ర అవకాశం లభించడం అదృష్టమని సీఎం పేర్కొన్నారు. జనవరి 28 నుంచి 31 వరకు జరగ నున్న గిరిజన మహా జాతర కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన ఏర్పాట్లు చేస్తోందన్నారు. వనదేవ తల గద్దెలను 101 కోట్ల రూపాయలతో కృష్ణశిల లతో అత్యంత వైభవంగా పునర్నిర్మించామని తెలిపారు. సుమారు 3 కోట్ల మంది భక్తులు వస్తారనే అంచనాతో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు. చారిత్రక నేపథ్యం ఉన్న ఈ పుణ్యక్షేత్ర మహిమను విశ్వవ్యాప్తం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని వివరించారు. చరిత్రలో మొదటి సారిగా రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని హైదరాబాద్ వెలుపల మేడారంలోనే నిర్వహించి ఈ ప్రాంతంపై ఉన్న గౌరవాన్ని చాటుకున్నామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. మేడారం జాతర అనేది ఒక చారిత్రా త్మక ఘట్టమని, ఇది ధైర్యాన్ని దైవత్వంగా మార్చిందని, కాకతీయ సామ్రాజ్యంపై తిరుగుబా టుకు నాయకత్వం వహించిన సమ్మక్క సారలమ్మ లను వన దేవతలుగా, కోట్లాదిమంది భక్తులకు ఇల వేల్పుగా విశ్వసించే సమయంలో మేడారంలో 'మహా జాతర'ను జరుపుకొంటారు. ఆదివారం సాయంత్రం ఐదున్నర గంటలకు ఖమ్మం నుండి హెలికాప్టర్ ద్వారా మేడారం చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డితో సహా రాష్ట్ర మంత్రివర్గం, మొత్తం రాష్ట్ర అధికార యంత్రాంగం 14 గంటల పాటు మేడారంలో బసచేయడం రాష్ట్ర చరిత్రలో ప్రత్యేక తగా పేర్కొనవచ్చు.

### - తాతా మనవడి తులాభారం @68 కిలోలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మనవడు రేవాన్ష్‌తో కలిసి సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా తాతా మనవడు ఇద్దరూ తులాభారం వేయించుకోగా వారి మొత్తం బరువు 68 కిలోలుగా నమోదైంది. తమ బరువుకు సమానమైన 68 కిలోల బంగారాన్ని (బెల్లం) వనదే వతలకు నైవేద్యంగా సమర్పించి మొక్కు తీర్చుకు న్నారు. ఈ జ్ఞాపకం తన జీవితంలో శాశ్వతంగా గుర్తుండిపోతుందని ముఖ్యమంత్రి భావోద్వేగానికి లోనయ్యారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు ఆయన తెలిపారు.

# నవాబ్ పేట అంగన్వాడీలో అక్షరాభ్యాసం

అక్షరదర్బార్, చిట్యాల : చిట్యాల మండలం నవాబ్‌పేట గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో కొత్తగా చేరిన చిన్నారులకు సోమవారం అక్ష రాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పర్లపల్లి రవి, ఉపసర్పంచ్ సారయ్య ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్వైజర్ జయప్రద మాట్లాడుతూ అంగ న్వాడీల ద్వారా అందుతున్న సదుపాయాలను గ్రామంలోని లబ్ధిదా రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సర్పంచ్ రవి మాట్లాడుతూ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు నిధులతో త్వరలో అంగన్వాడీ భవన నిర్మాణం చేపట్టి వచ్చే విద్యా సంవత్సరం నాటికి వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు కుసునపు కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు దొడ్డ ఆదర్శ్, అంగన్వాడీ టీచర్లు రాజేశ్వరి, వెంకటరమణ, శారద, విద్యార్థుల తల్లి దండ్రులు, ఆయాలు పాల్గొన్నారు.



# ప్రజల ముంగిటకే పాలన

### అజ్మీరా తండా గ్రామసభలో సర్పంచ్ రవి

అక్షరదర్బార్, మరిపెడ : ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అజ్మీరా తండా గ్రామ పంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ అజ్మీరా రవి అధ్యక్షతన జరిగిన సభలో వార్డుల వారీగా సమస్యలపై చర్చించి, తక్షణ పరిష్కారానికి తీర్మానాలు చేశారు. గ్రామసభ ప్రారంభంలో సద్గురు సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ పారదర్శక పాలనతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అలాగే అనారోగ్యంతో ఆర్థిక సాయం పొందిన లబ్ధిదారు లకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి అశోక్, ఉప సర్పంచ్ భూక్య కిషన్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ వెంకటయ్య, అంగన్వాడీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# 21న చిట్యాల క్లస్టర్ స్థాయి సీఎం కప్ క్రీడలు

అక్షరదర్బార్, చిట్యాల : చిట్యాల క్లస్టర్ స్థాయి సీఎం కప్ క్రీడలు ఈ నెల 21న చిట్యాల ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించను న్నట్లు ఎంపీడీవో జయశ్రీ తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకా రులు బుధవారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలని మండల విద్యాధికారి కోడెపాక రఘుపతి సూచించారు. చిట్యాల, కైలాపూర్, ఏలేటి రామయ్యపల్లి, చింతకుంట రామయ్యపల్లి, నవాబ్‌పేట గ్రామ పంచాయతీలకు చెందిన క్రీడాకారులు అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగ విభాగాల్లో పాల్గొనాలని క్లస్టర్ కోఆర్డినేటర్ సూదం సాంబమూర్తి తెలిపారు. వివరాలకు 9966992295 నంబర్‌ను సంప్రదించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రవికు మార్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ స్పీకర్‌కు చుక్కెదురు

- స్పీకర్ తీరుపై సుప్రీం కోర్టు అసహనం
- బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి పిటిషన్ పై విచారణ
- ఎమ్మెల్యేల ఫిరాయింపుల అంశం తేల్చకపోవడంపై స్పీకర్ కు నోటీసులు



అక్షరదర్బార్, న్యూఢిల్లీ : తెలంగాణలో రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న పార్టీ ఫిరాయింపుల వ్యవహారం ఇప్పుడు సుప్రీంకోర్టు గడప తొక్కిన నేపథ్యంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు చుక్కెదురైంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి చేరడంపై అనర్హత పిటిషన్లను నిర్ణీత గడువులోగా తేల్చకపోవడం పట్ల సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చినప్పటికీ మిగిలిన ముగ్గురు ఎమ్మెల్యేల విషయంలో జాప్యం జరగడాన్ని తప్పుబడుతూ బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై ధర్మాసనం స్పీకర్‌కు నోటీసులు జారీ చేసింది. గతంలో కోర్టు నిర్దేశించిన అల్టిమేటంను బేఖాతరు చేశారనే ఆరోపణలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం ఈ పిటిషన్‌ను కేటీఆర్ దాఖలు చేసిన ప్రధాన కేసుతో జత చేయాలని ఆదేశించింది. స్పీకర్ కార్యాలయం తరఫు న్యాయవాదులు అనారోగ్య కారణాలు అలాగే అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఎనిమిది వారాల గడువు కోరగా కోర్టు ఆ విన్నపాన్ని తోసిపుచ్చింది. కేవలం రెండు వారాల సమయం మాత్రమే ఇస్తూ తదుపరి విచారణ నాటికి పూర్తి స్థాయి పురోగతి నివేదికను సమర్పించాలని స్పష్టం చేయడంతో ఇప్పుడు బంతి స్పీకర్ కోర్టులోకి చేరింది. ఫిబ్రవరి 6వ తేదీకి విచారణను వాయిదా వేసిన ధర్మాసనం అప్పటిలోగా అనర్హత పిటిషన్లపై తుది నిర్ణయం తీసుకోవాలని సంకేతాలు ఇవ్వడంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

# మేడారం జాతర నిర్వహణలో సాంకేతికత

అక్షర దర్బార్ /ములుగు జిల్లా ప్రతినిధి: తెలంగాణా కుంభమేళాగా పేరుపొందిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఈసారి అత్యంత వైభవంగా నిర్వహించాలని తెలంగాణా సర్కార్ శత విధాలా ప్రయత్నం చేస్తుంది. మంత్రి సీతక్క మేడారం మహా జాతర బాధ్యతను భుజాల మీద వేసుకుని మరీ పని చేస్తున్నారు. ఈసారి మేడారం జాతరలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించాలని భావిస్తున్నారు. దీంతో మేడారం జాతర సకల హంగులతో కొత్త రూపు సంతరించుకోబోతుంది. మేడారం మహా జాతరకు కమాండ్ కంట్రోల్ రూమ్ జనవరి 28 నుంచి 31 వరకు జరగనున్న ఈ మహోత్సవం కోసం తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (AI) ఆధారిత వ్యవస్థలను ఉపయోగిస్తున్నారు. ఇక తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం భద్రతా ఏర్పాట్లపై సమీక్షించి, జాతరలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించారు.

## టీజీ క్వెస్ట్ అత్యాధునిక డ్రోన్ వ్యవస్థ

మేడారం 2.0'లో భాగంగా మేడారం జాతరలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం, ఎవరూ తప్పిపోకుండా ప్రజలందరికీ సురక్షిత జాతర అనుభవం కలిగించేలా జాతర భద్రతను పర్యవేక్షించేందుకు 'టీజీ-క్వెస్ట్' అనే అత్యాధునిక ఏఐ డ్రోన్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఈ వ్యవస్థ ద్వారా 30 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన అటవీ ప్రాంతం, జంపన్న వాగు, రద్దీ రోడ్లపై ఈ డ్రోన్లు నిరంతరం నిఘా ఉంటాయి.

## 13 వేల మంది పోలీస్ సిబ్బందితో నిఘా

అవి మాత్రమే కాకుండా హీలియం బెలూన్లకు అమర్చిన పాన్-టిల్ట్-జూమ్ కెమెరాలు ఎత్తు నుంచి రద్దీని విశ్లేషిస్తాయి. తొక్కిసలాట జరిగే అవకాశమున్న ప్రాంతాలను ముందే పసిగట్టి అధికారులను అప్రమత్తం చేస్తాయి. దాదాపు 13 వేల మంది పోలీసు సిబ్బంది ఈ టెక్నాలజీ సర్వైలెన్స్ లో విధులు నిర్వహించనున్నారు. మేడారం జాతరలో చాలా పెద్ద సంఖ్యలో జనాలు వస్తారు కాబట్టి ఎక్కువ శాతం తప్పిపోయే అవకాశం ఉంటుంది.

## జియోట్యాగ్ బేస్డ్ మిస్సింగ్ పర్సన్స్ ట్రాకింగ్

దాదాపు ఈసారి మూడు కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్న క్రమంలో జాతరకు వచ్చే భక్తులు ఎవరూ తప్పిపోకుండా చర్యలను చేపడుతున్నారు. గత జాతరలో దాదాపు 30 వేల మంది వరకు తప్పిపోయిన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి 'జియోట్యాగ్ బేస్డ్ మిస్సింగ్ పర్సన్స్ ట్రాకింగ్' వ్యవస్థను తీసుకు వస్తున్నారు. వొడాఫోన్-ఐడియా సహకారంతో ఈ విధానం అందుబాటులో ఉంటుంది.

## జియో ట్యాగ్ లతో తప్పిపోకుండా చర్యలు

పస్రా, తాడ్వాయి మార్గాల్లోని కౌంటర్లలో వృద్ధులు, పిల్లల వివరాలను నమోదు చేసి వారికి క్యూఆర్ కోడ్ గల జియోట్యాగ్‌లను కడతారు. దీంతో వారు ఎవరైనా తప్పిపోయినా ఈ ట్యాగ్ ను స్కాన్ చేయటం ద్వారా వారి పూర్తి వివరాలు తెలుస్తాయి. శబరిమలలో విజయవంతమైన ఈ విధానాన్ని ఇప్పుడు మేడారంలో అమలు చేయటానికి అధికారులు రంగం సిద్ధం చేశారు.

## ప్రత్యేకంగా 12 క్రైమ్ బృందాలు

తెలుగు, ఇంగ్లీష్‌తో పాటు హిందీ, తమిళ భాషల్లోనూ వివరాల నమోదుకు అవకాశం కల్పించారు. జాతరలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేకంగా 12 క్రైమ్ బృందాలు పనిచేస్తున్నాయి. పాత నేరస్థుల గుర్తింపునకు ఆసుపత్రి ప్రాంగణాలు, పార్కింగ్ స్థలాల వద్ద 'ఫేస్ రికగ్నిషన్' సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. అనుమానాస్పద వస్తువులను గుర్తించే రియల్-టైమ్ అలర్ట్ సిస్టమ్‌ను కూడా సిద్ధం చేశారు.

# వనదేవతలను దర్శించుకున్న నాయిని

అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సోమవారం ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో వనదేవతలను దర్శించుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా మేడారం చేరుకున్న నాయిని రాజేందర్ రెడ్డి సమ్మక్క సారలమ్మకు మొక్కులు చెల్లించారు. పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు నాయిని వెంట ఉన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ సుఖ సంతోషాలు, సమృద్ధి కలగాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. మేడారం జాతర నిర్వహణ కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా చేపట్టిందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని అన్నారు.



# సీపీని కలిసిన ఇన్ స్పెక్టర్



అక్షరదర్బార్, నర్సంపేట: నర్సంపేట పోలీస్ స్టేషన్ నూతన ఇన్ స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన ముస్క శ్రీనివాస్ సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను హనుమకొండ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీసుల పట్ల ప్రజలకు నమ్మకం గౌరవం పెరిగేలా విధులు నిర్వహించాలని, న్యాయం జరుగుతుందని నమ్మకాన్ని ప్రజల్లో కలిగించాలని అన్నారు.



# క్యాలెండర్ ఆవిష్కరణ

అక్షరదర్బార్, భూపాలపల్లి: పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా 2026 క్యాలెండర్ ను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ మనోహర్ రావు, ప్రధాన కార్యదర్శి జనగాం కరుణాకర్ రావు, కోశాధికారి బొంపల్లి గోవర్ధన్ రావు, ఉపాధ్యక్షుడు పుల్లూరి బాబురావు, ప్రచార కార్యదర్శి కొలుగూరి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్

- ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియ
- నితిన్ కు మద్దతుగా 32 సెట్ల నామినేషన్లు దాఖలు
- మరో వ్యక్తి బరిలో లేకపోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం
- రేపు బాధ్యతలు స్వీకరించనున్న నితిన్

అక్షరదర్బార్, న్యూఢిల్లీ : భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. న్యూఢిల్లీలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నామినేషన్ల ప్రక్రియ జరిగింది. బరిలో నితిన్ నబీన్ ఒక్కరే నిలవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. నితిన్ నబీన్ ఈ మేరకు పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి డాక్టర్ కే లక్ష్మణ్ ప్రకటించారు. బీహార్‌కు చెందిన నితిన్ నబీన్ కేవలం 45 ఏళ్ల ప్రాయంలోనే పార్టీ జాతీయ అధ్యక్షుడి పదవి చేపట్టి రికార్డు సృష్టించారు. ఆయన ఎన్నికను బలపరుస్తూ 37 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా సహా పలువురు అగ్రనేతలు ఆయన పేరును ప్రతిపాదించారు. నితిన్ నబీన్ మంగళవారం ఉదయం 11:30 గంటలకు పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915